నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం



భద్రాచలంలో ఆరంతస్తుల భవనం కూలిన ప్రమాదం చివరికి విషాదాంతమైంది. బుధవారం మధ్యాహ్నం నుంచి దాదాపు 12 గంటలపాటు కొనసాగిన రెస్క్యూ బృందాల ఆపరేషన్ గురువారం తెల్లవారుజామున సగభాగం ఫలించింది. శిథిలాల్లో చిక్కుపోయిన తాపీ మేస్త్రీ కామేశ్వరరావును అధికారులు ప్రాణాలతో బయటకు తీశారు. కానీ అప్పటికే కాలు, చెయ్యి నుజ్జునుజ్జు, తీవ్ర రక్తస్రావం జరిగిన నేపథ్యంలో ఆసుపత్రికి తరలించిన వెంటనే అతడు ప్రాణాలు వదిలాడు. మరోవైపు ఇంకో తాపీ మేస్త్రీ ఉపేందర్ కోసం శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం సాయంత్రం వరకూ అతడి ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులు జాగిలాలతో ఆనవాళ్లు గుర్తించి.. ఆ ప్రాంతంలో శిథిలాలను తొలగిస్తున్నారు. కాగా, తమకు న్యాయం చేయాలంటూ కామేశ్వరరావు కుటుంబీకులు, ఉపేందర్‌ను బయటకు తీయాలంటూ అతడి కుటుంబీకులు భద్రాచలం గోదావరి బ్రిడ్జి వద్ద గురువారం ఉదయం రాస్తారోకో చేశారు. కాగా, 30 గంటలుగా రెస్క్యూ ఆపరేషన్, శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. – భద్రాచలం, మార్చి 27

# విషాదాంతం

- భద్రాచలంలో భవనం కూలిన ఘటనలో కామేశ్వరరావు దుర్మరణం
- తెల్లవారుజామున ప్రాణాలతో బయటకు.. ఆ వెంటనే కన్నుమూత
- ఉపేందర్ ఆచూకీ కోసం కొనసాగుతున్న అధికారుల అన్వేషణ
- జాగిలాలతో సెర్చింగ్.. అనుమానిత ప్రాంతాల్లో తవ్వకాలు
- 30 గంటలుగా రెస్క్యూ ఆపరేషన్, శిథిలాల తొలగింపు ప్రక్రియ
- గోదావరి బ్రిడ్జి వద్ద ఉపేందర్ కుటుంబ సభ్యుల రాస్తారోకో
- కామేశ్వరరావు మృతదేహాన్ని తీసుకోబోమంటూ కుటుంబీకుల ఆందోళన
- శిథిలాల్లో లభించిన ప్రత్యేక లాకర్ పోలీసు స్టేషన్‌కు తరలింపు



యంత్రాలతో శిథిలాలను తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బంది



రోదిస్తున్న కామేశ్వరరావు తల్లి



తమకు న్యాయం చేయాలంటూ గోదావరి బ్రిడ్జి వద్ద రాస్తారోకో చేస్తున్న ఉపేందర్ కుటుంబీకులు

శ్రీపతి సేవా ట్రస్టు పేరిట భద్రాచలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఆరు అంతస్తుల భవనం బుధవారం మధ్యాహ్నం కుప్పకూలిన విషయం విదితమే. ఆ సమయంలో ఆ భవనంలో పలువురు ఉన్నట్లు ప్రచారం జరిగినప్పటికీ ఇద్దరు తాపీ మేస్త్రీలు ఉన్నట్లు మాత్రం తాజాగా అధికారులు నిర్ధారిస్తున్నారు. అయితే, బుధవారం మధ్యాహ్నం నుంచి శిథిలాల తొలగింపు ప్రక్రియ నిరాటంకంగా కొనసాగుతోంది. ఒక తాపీ మేస్త్రీ కామేశ్వరరావును గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో రెస్క్యూ సిబ్బంది బయటకు తీశారు. చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. మరో తాపీ మేస్త్రీ ఉపేందర్ ఆచూకీ కోసం జాగిలాల సహాయంతో స్థలాన్ని గుర్తించారు. ఎన్‌డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ సిబ్బంది ఆ ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. గురువారం సాయంత్రం దాకా ఉపేందర్ ఆచూకీ లభించలేదు. కాగా, శిథిలాలను తొలగిస్తుండగా బీరువా లాంటి లాకర్ ఒకటి లభ్యమైంది. అందులో విలువైన బంగారం, నగదు, వివిధ పత్రాలు ఉండడంతో అధికారులు దానిని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

### సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న పీవో, ఆర్డీవో, ఏఎస్పీ..

శిథిలాల తొలగింపు ప్రక్రియను, సహాయక చర్యలను ఐటీడీఏ పీవో రాహుల్, ఆర్డీవో దామోదర్‌రావు, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, డీఎఫ్‌వో క్రాంతికుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు. సింగరేణి, ఎన్‌డీఆర్ఎఫ్, ఫైర్, పంచాయతీ, ఐటీసీ అధికారులు, సిబ్బంది శిథిలాలను పలు చోట్ల తొలగిస్తూ, ఆనవాళ్లు పరిశీలిస్తూ ముందుకెళ్తున్నారు. ఉపేందర్ శిథిలాల కిందనే పడి ఇప్పటికే మృతిచెంది ఉంటాడని అధికారులు భావిస్తున్నారు. కాగా, తమకు న్యాయం చేయాలని కోరుతూ ఘటనా స్థలం వద్ద గురువారం ఉదయం కామేశ్వరరావు, ఉపేందర్ కుటుంబ సభ్యులు ఆందోళ నిర్వహించారు.

### ప్రాణాలతో బయటికొచ్చి.. అంతలోనే ఆయుష్షు వీడి..

గురువారం తెల్లవారుజామున కామేశ్వరరావును కొన ఊపిరితో రెస్క్యూ సిబ్బంది బయటకు తీశారు. అతడు ప్రాణాలతో ఉండడంతో అతడి కుటుంబ సభ్యులు, అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా అతడి కుటుంబ సభ్యులు ఎంతగానో సంతోషించారు. కానీ వారి ఆశలు గంట వ్యవధిలోనే ఆవిరయ్యాయి. వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా అతడు ప్రాణాలు విడిచాడు. దీంతో కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. కామేశ్వరరావు తండ్రి వెంకటేశ్వరరావు ఏడాది క్రితమే మృతిచెందాడు. ఇంతలోనే కొడుకు కూడా మృతిచెందడంతో ఆ తల్లి దుఃఖాన్ని ఎవ్వరూ ఆపలేకపోయారు. అలాగే, ఉపేందర్‌ను బయటకు తీయాలని అతడి కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు గోదావరి బ్రిడ్జి సెంటర్‌లో ఆందోళన చేశారు. అక్కడ ఉపేందర్ కుటుంబ సభ్యులను దళిత సంఘాల నాయకులు పరామర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఘటనపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కామేశ్వరరావు (ఫైల్)



స్లాబ్‌ను డ్రిల్ చేస్తున్న రెస్క్యూ టీం

### బీఆర్ఎస్ సహా పలు పార్టీల పరామర్శ..

ఉపేందర్, కామేశ్వరరావు కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, ఆకోజు సునీల్ తదితరులు ఘటనా స్థలంలో పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించాలని, రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భవన యజమాని శ్రీపతి శ్రీనివాస్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు కూడా పరామర్శించి ఉపేందర్ కుటుంబాన్ని ఆదుకోవాలని రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, సీపీఎం నాయకులు కూడా బాధితుల కుటుంబాలను పరామర్శించారు.



శిథిలాలను తొలగిస్తున్న యంత్రాలు



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

### అర్ధరాత్రి వరకూ మరో మృతదేహం?

శిథిలాలు తొలగిస్తున్న రెస్క్యూ బృందాల సభ్యులు ఓ ప్రాంతంలో దుర్వాసన వస్తుండడాన్ని గుర్తించారు. అక్కడ యంత్రాలతో తవ్వకాలు నిలిపివేసి సాధారణ డ్రిల్లింగ్ ద్వారా గొయ్యి తీసి ముందుకెళ్తున్నారు. గురువారం అర్ధరాత్రి, లేదా శుక్రవారం తెల్లవారుజాము లోపు ఉపేందర్ ఆచూకీ లభ్యమయ్యే అవకాశాలున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఉపేందర్ ఆ శిథిలాల్లో చిక్కుకొని ఇప్పటికే 48 గంటలు దాటిపోవడంతో అతడు బతికి ఉంటాడన్న ఆశ ఆవిరైందని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

### ఇంటెలిజెన్స్ బృందాల ఆరా..

భవన నిర్మాణదారుడు శ్రీపతి శ్రీనివాస్ గురించి పోలీసు ఇంటెలిజెన్స్ బృందాలు లోతుగా ఆరా తీస్తున్నాయి. 'ఇంత వివాదాస్పద కట్టడాన్ని ఎలా నిర్మించాడు? శ్రీనివాస్ గత చరిత్ర ఏమిటి?' అనే విషయాలను తెలుసుకుంటున్నాయి. గతంలో ఇతడు మావోయిస్టులకు సహకరించాడనే ఆరోపణలు, కేసు ఉన్నాయి. 'మౌలా శ్రీను అనే వ్యక్తిగా ఉండే ఇతడు ట్రస్టు నిర్వాహకుడిగా ఎలా మారాడు? ట్రస్టుకు విరాళాలు ఎలా అందాయి' అనే అంశాలపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు సమయంలో వివరాలన్నీ బలంగా ఉండేలా పోలీసులు ముందుగానే ఆరా తీస్తున్నారు.

# జర్నలిస్టుల రైల్వే రాయితీని పునరుద్ధరించాలి

**రాజ్యసభలో ప్రస్తావించిన ఎంపీ వద్దిరాజు**



ఖమ్మం, మార్చి 27: జర్నలిస్టులకు 50 శాతం రాయితీతో పాస్‌లు అందించే పథకాన్ని పునరుద్ధరించాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యసభలో గురువారం ఆయన మాట్లాడుతూ కొవిడ్ సమయంలో ఎత్తివేసిన రాయితీ పథకాన్ని మళ్లీ పునరుద్ధరించలేదని, దీంతో విధి నిర్వహణలో భాగంగా రైళ్లలో ప్రయాణించే జర్నలిస్టులు చాలా ఇబ్బంది పడుతున్నారని గుర్తుచేశారు. దీనిని పునరుద్ధరించాలని పాత్రికేయులు, ఆయా సంఘాలు మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వానికి చేస్తున్న విజ్ఞప్తులను ఆయన ఈ సందర్భంగా వివరించారు. అనంతరం వద్దిరాజు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను పార్లమెంటులోని ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందిస్తూ అధికారులకు తగిన ఆదేశాలిచ్చారు.

# రుణమాఫీ పేరిట వెన్నుపోటు: తాతా

ఖమ్మం, మార్చి 27: రుణమాఫీ పేరిట తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ఎమ్మెల్సీ తాతా మధు విమర్శించారు. రైతుల పంట రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో మాఫీ చేయకపోవడాన్ని విమర్శిస్తూ అసెంబ్లీ ఆవరణలో ప్లకార్డులు పట్టుకొని గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చెప్పుకుంటున్న రుణమాఫీ పెద్ద బోగస్ అని విమర్శించారు. సహచర బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



శాసనమండలి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు

# ఉన్నమాటంటే ఉలికిపాటెందుకు?

**జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు**

**కేటీఆర్‌పై భట్టి అనుచిత వ్యాఖ్యలు సరికాదు**



మాట్లాడుతున్న ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

బోనకల్లు, మార్చి 27: కాంగ్రెస్ ప్రభుత్వంలో 30 శాతం కమీషన్లు లేనిదే పనులు చేయడం లేదని మాజీ మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో మాట్లాడితే ఆర్థిక మంత్రి భట్టికి ఉలికిపాటు ఎందుకని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ప్రశ్నించారు. రావినూతల గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమల్‌రాజు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 30 శాతం కమీషన్ ఇస్తేనే బిల్లులు చెల్లిస్తున్నారని కాంగ్రెస్ నాయకులే బహిరంగంగా చెబుతున్నారనే విషయాన్ని అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడారన్నారు. అయితే దీనిపై భట్టి విక్రమార్క కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గుమ్మడికాయల దొంగ ఎవరంటే భట్టి భుజాలు తడుముకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గతంలో సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి పెట్టిన ఖర్చులను ఈ ప్రభుత్వం పైసా కూడా చెల్లించడం లేదన్నారు. 200 మంది కాంట్రాక్టర్లు ఏకంగా బిల్లుల కోసం రాష్ట్ర సచివాలయంలో ధర్నా చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేటీఆర్‌పై భట్టి చేసిన వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామన్నారు. బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తుంటే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు అంటూ అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేయకుండా దోపిడీ చేయడమే పనిగా పెట్టుకున్నదని ఆరోపించారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని అబద్ధపు హామీలు ఇచ్చి రైతులను మరింతగా మోసం చేసిందన్నారు. మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, లేదంటే ప్రజల తరఫున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, కొనకంచి నాగరాజు, వంకాయలపాటి నాగేశ్వరరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు పారా ప్రసాద్, మాజీ సర్పంచ్ కొమ్మినేని ఉపేంద్ర, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నూనావత్ సైదా, భూక్య లక్కియా పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం

**ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



ఆర్టీసీ సిబ్బందితో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, మార్చి 27: బస్సుల ద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కొనియాడారు. వేసవి దృష్ట్యా ఖమ్మం బస్సు డిపోలోని ఆర్టీసీ సిబ్బంది కలెక్టర్ గురువారం వాటర్ బాటిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆర్టీసీ ఉద్యోగులు ప్రజలకు సేవలు అందిస్తున్నారని, వీరి కృషి ద్వారా అన్ని వర్గాలకు రవాణా సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు కష్టపడి పని చేస్తున్నారని, ప్రస్తుత వేసవిలో వారికి ఉపయోగపడే విధంగా జిల్లా యంత్రాంగం తరఫున 650 బాటిళ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఫైనాన్షియల్ ప్లానింగ్‌పై అవగాహన కల్పించేందుకు లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ప్రత్యేకంగా పంపించి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్స్, మెకానికల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, డీఎం దినేశ్‌కుమార్, డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు

# పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

**సన్నాహక సమావేశంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్**

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఐడీవోసీలోని సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, తూనికలు కొలతలు, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,84,502 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందు కోసం 144 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అవసరాన్నిబట్టి అదనపు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, బీ గ్రేడ్‌కు రూ.2,300 మద్దతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్లు, షేడ్ నెట్‌లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి నీడ ఉండే విధంగా చూసుకోవాలన్నారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో విద్యాచందన, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ త్రినాథ్, పౌర సరఫరాల అధికారి రుక్మిణి, డీసీవో ఖుర్షీద్, జిల్లా వ్యవసాయాధికారి బాబురావు, జీసీసీ మేనేజర్ విజయ్‌కుమార్, తూనికలు కొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి నరేందర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నుంచి ఆనందరావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

# మిర్చి రైతు వినూత్న నిరసన

**గిట్టుబాటు ధర కల్పించాలని, రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్**

ఖమ్మం రూరల్, మార్చి 27: మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎన్నికల హామీలో భాగంగా అర్హులైన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ రూరల్ మండలం కస్నాతండాకు చెందిన రైతు భూక్యా నాగేశ్వరరావు అర్ధనగ్నంగా, మెడలో మిర్చి దండ, చేతిలో ప్లకార్డుతో తన మిర్చి కల్లంలో గురువారం గంటపాటు నిరసన చేపట్టాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఖమ్మంలోని ఓ బ్యాంకులో రూ.2.25 లక్షల పంట రుణం తీసుకున్నట్లు తెలిపాడు. బ్యాంకు అధికారులు ఒత్తిడి చేయడంతో బయట ఫైనాన్స్‌కు తెచ్చి రూ.2.20 లక్షల అసలుతో పాటు వడ్డీ రూ.50 వేలు కలిపి.. మొత్తం రూ.2.70 లక్షల బాకీ తీర్చినట్లు చెప్పాడు. అయినప్పటికీ తనకు రుణమాఫీ డబ్బులు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాక నాలుగెకరాల భూమి కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేశానని, ఆశించిన దిగుబడి రాకపోవడంతోపాటు మార్కెట్‌లో ధర గణనీయంగా తగ్గిందని వాపోయాడు. ప్రభుత్వం వెంటనే ఈ రెండు అంశాలపై దృష్టి సారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ నిరసనకు దిగినట్లు నాగేశ్వరరావు పేర్కొన్నాడు.



కస్నాతండాలో మిర్చి దండ మెడలో వేసుకుని వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న రైతు

# తహసీల్ ఎదుట ఉపాధ్యాయుల ఆందోళన

**పెండింగ్ బిల్లులు చెల్లించాలని పీఆర్‌టీయూ టీఎస్ డిమాండ్**



పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు, ఉపాధ్యాయులు

పాల్వంచ, మార్చి 27: పెండింగ్ బిల్లులతోపాటు జీపీఎఫ్ డబ్బులు, సంపాదిత సెలవుల డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని కేటీపీఎస్ ఆవరణలో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పొదిలి సత్యనారాయణ భార్య అనారోగ్యంతో బాధపడుతున్నా ప్రభుత్వం ఏడాది నుంచి జీపీఎఫ్, సంపాదిత సెలవులకు సంబంధించి బిల్లుల డబ్బులు ఇవ్వలేదని, దీంతో సరైన వైద్యం అందక ఆమె మృతిచెందిందని తెలిపారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లుల డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డి.వెంకటేశ్వర్లు, బి.రవి, వి.శ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాసరావు, సంఘమేశ్వర్‌రావు, ఎంఈవో శ్రీరాంమూర్తి, ప్రభావతి, సుధాశ్రీ, పద్మజ, మోతీలాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో సర్కారు విఫలం

- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, రామయ్య, అశోక్
- మాస్‌లైన్ ఆధ్వర్యంలో కేఎంసీ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న మాస్‌లైన్ నాయకులు, కార్యకర్తలు

ఖమ్మం, మార్చి 27: ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, సీఎం రేవంత్‌రెడ్డి ఆ హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 16 వేల ఆసరా పెన్షన్లు తక్షణమే మంజూరు చేయాలని, బోదకాలు బాధితులను దివ్యాంగులుగా గుర్తించాలని, పెన్షన్ల పెంపు హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పింఛన్ల కోసం అర్హులైన వారు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో బోదకాలు బాధితుల సంఖ్య ఎక్కువగా ఉన్నదని, వారిని దివ్యాంగులుగా గుర్తించి పెన్షన్ మంజూరు చేస్తామన్న హామీని గాలికొదిలేశారన్నారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. అనంతరం మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నాయకులు సీహెచ్.శిరోమణి, శోభ, కే శ్రీనివాస్, బల్లెపల్లి వెంకటేశ్వర్లు, కే శ్రీనివాస్, సత్తార్, లెనిన్, వెంకటేష్, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, చందు, రామారావు, జాస్మిన్, రమేశ్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు



పెనుబల్లి: స్టేషన్‌లో పోలీసుల అదపు లో మాజీ సర్పంచ్‌లు

సత్తుపల్లి టౌన్/పెనుబల్లి/ఖమ్మం రూరల్, మార్చి 27 : పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లాలోని సత్తుపల్లి, పెనుబల్లి, రూరల్ మండలాల నుంచి హైదరాబాద్ వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను గురువారం తెల్లవారుజాము నుంచే పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బిల్లులు రాకపోవడంతో చాలా మంది మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో సత్తుపల్లి మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు మందపాటి వాసురెడ్డి, మాజీ సర్పంచ్‌లు వేల్పుల కళావతి, కంచర్ల రమాదేవి, సాదు ఉదయలక్ష్మి, మందపాటి సరస్వతి, బేతిని శ్రీనివాసరావు, దేసిరెడ్డి సంగారెడ్డి, కల్లూరులో అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు నందిగం ప్రసాద్, శీలం పుల్లారెడ్డి, గొల్లమందల ప్రసాద్, రావి సత్యనారాయణ, సింగిశాల పద్మ, ప్రసాద్, తీర్థాల మాజీ సర్పంచ్ బాలునాయక్ ఉన్నారు.